క్లుప్తంగా

అసోసియేషన్‌కు స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే చంటిని కలిసిన నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పారా మిలటరీ అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటుకు నగరంలో స్థలం లేదా భవనం కేటాయించాలని అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే బడేటి చంటిని కోరారు. శుక్రవారం ఉదయం చంటిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. స్థలం కేటాయింపునకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సోమవరపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పరసాబత్తుల బాబూరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): విధుల నుంచి తొలగించిన డీసీసీబీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. పదేళ్లకు పైబడి డీసీసీబీ బ్యాంకుకు చెందిన 34 శాఖల్లో పనిచేస్తున్న 54 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎటువంటి కారణాలు లేకుండా జూన్ 2వ తేదీ నుంచి విధుల నుంచి తొలగించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి అన్యాయం చేసిన మోదీ సర్కార్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ప్రాణత్యాగం చేసిన కాంగ్రెస్ కార్యకర్త మునికోటి వర్ధంతి కార్యక్రమం ఏలూరులోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. నాయకులు కమ్ముల కృష్ణ, సుబ్రహ్మణ్య శర్మ, కొమ్మన సాంబశివరావు, రామసూరి సాయి, సుంకర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే లైసెన్సులు రద్దు



మందుల షాపుల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఏలూరు టౌన్: మందుల షాపుల్లో వైద్యుల ప్రిస్కిప్షన్ మేరకే మందులు విక్రయించాలని, కొనుగోలు బిల్లులు ఇవ్వాలని ఔషధ నియంత్రణ, తనిఖీ శాఖ ఏడీ హరిప్రసాద్ అన్నారు. ఏలూరు నగరంలోని సద్భావన మెడికల్స్, సూర్య మెడికల్, సిరి మెడికల్స్, గ్లోబల్ మెడికల్స్, అరుణోదయ, సాయిశ్రీపవన్ మెడికల్స్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఒక మందుల షాపులో అబార్షన్ కిట్లు, మరో రెండు షాపుల్లో నార్కోటిక్ డ్రగ్స్ నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నట్టు గుర్తించామని హరిప్రసాద్ తెలిపారు. వీటిపై చర్యలు తీసుకుంటామన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే గణపవరం, తాగేపల్లిగూడెం, భీమవరంలో మూడు షాపుల లైసెన్సులను రద్దు చేశామని తెలిపారు. గర్భ నిరోధక మాత్రలు, అబార్షన్ కిట్లు వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా విక్రయిస్తే షాపులకు లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. తనిఖీల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు డాక్టర్ బాలు, మల్లికార్జున ఉన్నారు.

జెడ్పీ పీఎఫ్ ఖాతాలను అందుబాటులోకి తేవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈనెల 31లోపు జిల్లా పరిషత్ పీఎఫ్ ఖాతాలను ఆయా ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేవీ సుబ్బారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర మాట్లాడారు. పీఎఫ్ ఖాతాలను ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకురాక పోతే సెప్టెంబర్ మొదటి వారంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

నాన్ స్టాప్ బస్సు నడపాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం – విజయవాడ మధ్య ఆర్టీసీ నాన్‌స్టాప్ సర్వీసు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వ్యాపారస్తులు, విద్యార్థుల తల్లితండ్రులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జంగారెడ్డిగూడెం పట్టణ బీజేపీ అధ్యక్షుడు, ఆర్టీసీ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ కొప్పాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఇనగడుపు సతీష్, కక్కిరాల పాండు, ఉప్పల శేఖర్, పోడూరి దూరి శ్రీను పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

- ఇండోర్ స్టేడియం మెయిన్ గేటుకు వెళ్లే మార్గంలో వాహనాల పార్కింగ్
- చోద్యం చూస్తున్న కార్పొరేషన్, పోలీస్, రవాణా అధికారులు
- రాకపోకలకు తప్పని అవస్థలు



ఇండోర్ స్టేడియంకు వెళ్లే ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇలా..



సాయంత్రం వేళ్ల ఒకేసారి పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వస్తున్న విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): నగరంలోని ఏలూరు ఇండోర్ స్టేడియం మెయిన్ గేటుకు వెళ్లే మార్గంలో రాకపోకలంటే ప్రజలు హడలిపోతున్నారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ రహదారికి ఇరువైపులా ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు, ప్రైవేటు వాహనాలను పెద్దసంఖ్యలో నిలిపి ఉంచడం, ఒక్కసారిగా విద్యార్థులు రోడ్డుపైకి రావడంలో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారుతుంది. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు ప్రైవేటు కాలేజీల యాజమాన్యం, వ్యాపార వర్గాలు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడడంతో చర్యలకు ఉపక్రమించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఏలూరు ఇండోర్ స్టేడియం మెయిన్ గేటుకు వెళ్లే మార్గంలోనే జిల్లా కలెక్టరేట్‌కు, కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వా కార్యాలయాలు, ఎస్‌బీఐ మెయిన్ బ్యాంక్‌కు, జెడ్పీ గెస్ట్ హౌస్ ఉన్నాయి. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది ఉద్యోగులు, జిల్లా, మండల స్థాయి అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ రహదారికి ఇరువైపులా ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు, ప్రైవేటు వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. దీంతో రాకపోకలకు ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఒక్కోసారి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ మార్గంలో జిల్లా అధికారులు ప్రయాణం చేస్తున్న వాహనాల అక్రమ పార్కింగ్‌పై స్పందించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ రహదారిపై వాహనాల పార్కింగ్‌తో పాటు ఆవులు, కుక్కల సంచారంతో సమస్య తీవ్రంగా మారుతుంది. వాహనచోదకులకు ఆవులు, కుక్కలు అడ్డువచ్చి అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. మరోవైపు మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్లు ట్రిపుల్ రైడింగ్‌తో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పట్టించుకునేవారేరీ?

ప్రైవేటు విద్యా సంస్థల కాలేజీలు దాదాపు అన్నీ స్థానిక నరసింహారావుపేట ప్రాంతంలో ఉన్నాయి. వీటన్నింటినీ సాయంత్రం 6 గంటలకు వదులుతున్నారు. దీంతో వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులు రోడ్లపైకి వస్తున్నారు. తమ పిల్లలను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలుతో రావడం, ఆటోలు, కార్లు రావడం వంటి కారణాలతో సాయంత్ర వేళ నరసింహారావుపేటలోని రోడ్లన్నీ పూర్తి ట్రాఫిక్‌తో నిండిపోతున్నాయి. ఏలూరు పరిసర ప్రాంతాల నుంచి, నగరంలోని శివారు ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే విద్యార్థులంతా కాలేజీ బస్సులు ఎక్కేందుకు ఒకేసారిగా ఇండోర్ స్టేడియం వైపు ఆపి ఉంచిన బస్సులు ఎక్కేందుకు వస్తున్నారు. దీంతో ఆ సమయంలో ఈ ప్రాంతమంతా జనసంద్రంగా మారిపోతుంది. దీనిని అరకట్టేందుకు గతంలో పోలీసు యంత్రాంగం సంబంధిత కాలేజీ యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులను సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య వేరువేరు సమయాల్లో విడిచిపెట్టేలా చర్యలు తీసుకునేవారు. తాజాగా అటువంటి నిబంధనలేవీ లేకపోవడంతో విద్యార్థులంతా 6 గంటలకే రోడ్డుపైకి రావడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

ఇబ్బంది పడుతున్నాం



ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేందుకు ఇండోర్ స్టేడియంకు వెళ్లి వస్తుంటాం. ఉదయం ఎటువంటి ఇబ్బందీ లేదు. సాయంత్రం తిప్పలు తప్పడం లేదు. ఇండోర్ స్టేడియానికి ఎదురుగా, పక్కగాను పదుల సంఖ్యలో ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు నిలిపి ఉంచుతున్నారు. దీంతో లోపలికి వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నాం. – గెద్ద రాఘవ రంగారావు, అధ్యక్షులు, ఇండోర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్, ఏలూరు

పార్కింగ్ ప్రదేశం కేటాయించాలి



ఒకపక్క ఇండోర్ స్టేడియం, మరోపక్క వివిధ జిల్లా కార్యాలయాలు, బ్యాంకులు ఉన్న ప్రాంతంలో కాకుండా ప్రైవేటు విద్యాసంస్థల బస్సులకు ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ కేటాయించాలి. దాని వల్ల ఈ ప్రాంతంలో సాయంత్రం వేళ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించే వీలు ఉంటుంది. ప్రైవేట్ విద్యా సంస్థలతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలి. – మల్లిపూడి రాజు, సామాజిక కార్యకర్త,ఏలూరు

శబ్ద కాలుష్యం



ప్రతి రోజు సాయంత్ర వేళ వాకింగ్‌కు ఇండోర్ స్టేడియంకు వచ్చి వెళుతుంటాను. ఈ ప్రాంతంలోని ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు నిలిపి ఉండటంతో అవి చేసే రణగొణ ధ్వనులు శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తున్నాయి. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. పార్కింగ్‌కు సంబంధిత అధికారుల అనుమతి ఉందో లేదో కూడా తెలియని పరిస్థితి. సమస్యను పరిష్కరించాలి. – కామిరెడ్డి అక్కయ్య చౌదరి, వాకర్ సభ్యుడు, ఏలూరు

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



ఏలూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరులో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక వసంత మహల్ సెంటర్ నుంచి మున్సిపల్ ఆఫీస్ మీదుగా పాత బస్టాండ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వరకు ప్రదర్శన నిర్వహించి, అక్కడ నిరసన వ్యక్తం చేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ అడవులను, కొండలను సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ పర్యావరణాన్ని కేంద్ర, రాష్ట్ర పాలకులు విధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతాంగానికి, ఉపాధి హామీ పథకానికి కోతలు విధించిందని విమర్శించారు. కార్యక్రమానికి ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వి.శ్రీనివాసరావు, వి.గౌరి, కె.రామారావు, మడి గిరి తదితరులు నాయకత్వం వహించారు.

- అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘ కార్యాలయంలో సంఘం జెండాను ఎంఈఓ ఆర్ రంగయ్య ఆవిష్కరించారు. గిరిజనులందరూ ఐక్యంగా ఉండాలని, హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు బూక్యా రామునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నంబూరి శ్రీనివాసరావు, ఇ.అశోక్, బి.మహేష్, డి.ప్రవీణ్ నాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఈఓ రంగయ్య మాట్లాడారు. చదువుతోనే ప్రతి ఎస్టీ కుటుంబం అభివృద్ధి చెందుతుందని రంగయ్య అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్, ప్రోగ్రామ్ మేనేజర్ శ్యామ్యూల్ అనిల్ కుమార్, సీనియర్ న్యాయవాది కట్టా సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ మాజీ సభ్యులు మేతర అజయ్ బాబు, సోషల్ సర్వీస్ కోఆర్డినేటర్స్ ఎస్ వీరాస్వామి, ఎస్ కాసు, డీబీఆర్‌సీ జిల్లా కన్వీనర్ ఎస్ జ్యోతి, నగర కో ఆర్డినేటర్ బలే సురేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు పిలుపునిచ్చారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఏలూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ సమన్వయంతో, పొగాకు, మాదక ద్రవ్యాలు, మద్యం వినియోగించడం వల్ల ఏర్పడే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్‌టీసీపీ సైకాలజిస్ట్ కేసీహెచ్ వీర్రాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను దుర్భరం చేసుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిషా ముక్త భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ ఆసుపత్రి డీఅడిక్షన్ సెంటర్ కౌన్సిలర్ కె.విజయ, డీసీ మొబలైజర్ వెంకట్ పాల్గొన్నారు.

కష్టపడి చదివే విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కష్టపడి చదివే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ముందుకు వెళుతున్నామని సీఆర్ రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. నగరంలోని సీఆర్‌ఆర్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్‌లో జీప్యాట్, నైపర్‌తో పాటుగా ఏపీ పీజీ సెట్, తెలంగాణ పీజీ సెట్, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను శుక్రవారం కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సన్మానించింది. జీప్యాట్, నైపర్‌లలో అర్హత సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే, ఏపీ పీజీ సెట్ , తెలంగాణ పీజీసెట్‌లలో అర్హత పొందిన ఇద్దరు విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు. వీరితో పాటు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో అర్హత పొందిన 43 మందికి మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజా రామ మోహనరావు, ప్రిన్సిపాల్ ఎ.నరేంద్రబాబు, సిబ్బంది, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీలను తరిమికొడదాం



విజయవిహార్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): మోదీ ప్రభుత్వ కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరు విజయవిహార్ సెంటర్‌లోని రిలయన్స్ షాపింగ్ మాల్ వద్ద శుక్రవారం రైతు సంఘాల సమన్వయ కమిటీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్ కంపెనీలను దేశం నుంచి తరిమి కొట్టాలంటూ పిలుపు నిచ్చారు. రైతులకు రుణమాఫీ చేయాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతులకు విత్తన చట్టం తేవాలని, ఉపాధి హామీ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు ఎస్కే బాషా, కె.శ్రీనివాస్, డేగా ప్రభాకర్, బండి వెంకటేశ్వరరావు, గడసాల రాంబాబు, కంకిపాటి బుచ్చిబాబు, పీవీ రామకృష్ణ, బి.సోమయ్య మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషిచేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుబ్బారావు

ఏలూరు(మెట్రో) / ఏలూరు రూరల్ : సుస్థిర అభివృద్ధిలో గ్రామ పంచాయతీలు సమగ్ర సాధికారత సాధించడానికి స్థానిక ప్రభుత్వాలు కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో కేవీవీ సుబ్బారావు అన్నారు. ఏలూరు డీపీఆర్‌సీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం టీవోటీ శిక్షకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ సుబ్బారావు మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. విస్తరణ శిక్షణ కేంద్రం నుంచి ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు శిక్షణా తరగతులు నిర్వహించారు. జిలాల ట్రైనింగ్ మేనేజర్ గుర్రాల ప్రసంగిరాజు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 24 మండలాల్లో ఈ నెల 12 నుంచి 14 వరకు మిగిలిన 24 మండలాల్లో 19 నుంచి 21 వరకు రెండు విడతులగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ప్రతి మండలంలో 3 రోజుల శిక్షణకు 288 మంది రీసోర్స్ పర్సన్లను ఎంపిక చేశామన్నారు. పారిశుధ్యం, ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 122 మంది రీసోర్స్ పర్సన్‌లు హాజరై శిక్షణ పొందారు. డీపీఆర్‌సీ రీసోర్స్ పర్సన్‌ల బీహెచ్ ఎన్‌వీ కృష్ణంరాజు, బి.మొహిద్దీన్, రామలక్ష్మి, పాండు రంగారావు, విశ్వనాథ్, డీపీఆర్‌సీ సీనియర్ సహాయకులు కేవీవీ రాంబాబు, బి.కిరణ్‌కుమార్, ఫీల్డ్ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

13న ఏలూరులో జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): ఏలూరు కలెక్టరేట్ కాంపౌండ్‌లోని సెట్ కార్యాలయంలో ఈ నెల 13న ఉదయం 10 గంటల నుండి జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సి.మధుభూషణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం (నేషనల్ కెరీర్ సర్వీస్), ఏపీ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్, ఏలూరు సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అమేజాన్ (కేఎల్ గ్రూపు)కు చెందిన ప్రతినిధులు హాజరవుతారని, ఆంధ్ర- తమిళనాడు బోర్డర్‌లోని వేర్ హౌస్‌లో అసోసియేట్స్‌గా పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 88868 82032లో సంప్రదించాలని మధుభూషణరావు పేర్కొన్నారు.

శ్రావణ శుక్రవారం పూజలు



సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రావణ మాసం తొలి శుక్రవారం పూజలు నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజ చేసి అనంతరం వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. పత్తేబాద నాలుగు గుడుల సెంటర్‌లోని కనకదుర్గమ్మవారికి ఎండు ఖర్జూరం, పోక చెక్కలతో ప్రత్యేక అలంకరణ చేశారు. 12 పంపుల సెంటర్‌లోని కనకదుర్గమ్మవారికి మహిళలు 108 మంది 108 రకాల సారెను సమర్పించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కుక్కునూరు: భారీ వర్షం దాటికి రెడ్డిగూడెం గ్రామంలోని పెదవాగు పొంగి ఇల్లు నీటి మునగడంతో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆదివాసి సంక్షేమ పరిషత్, ఏఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై ఆగ్రహం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం సమాజానికి గొడ్డలి పెట్టని ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ద్వారా కొత్త వివాదాలు వస్తాయని, ముస్లింలు తమ ప్రయోజనాలు, భూములను కోల్పోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ బిల్లుపై పలువురి అభిప్రాయాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాలి



వక్ఫ్ సవరణ బిల్లుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపితే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుంది. మా సంస్థ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పేదరికం, ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దానిని కప్పిపుచ్చడానికి మైనార్టీ విషయాల్లో కలుగజేసుకుని ప్రధాన సమస్యను పక్కదారి పట్టించేందుకే వక్ఫ్ సవరణ చట్టం తెరపైకి తీసుకువచ్చారు.
– షేక్ ఖాదర్, ఐడియల్ యూత్ మూమెంట్ (ఐవైఎం) ఏలూరు నగర అధ్యక్షుడు

హక్కులను తొలగించే కుట్ర



వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలకు ఆమోదయోగ్యం కాదు. వక్ఫ్ వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని తగ్గించడం, ముస్లిం సమాజానికి వక్ఫ్ ప్రయోజనాలను దూరం చేయడమే లక్ష్యంగా ఈ బిల్లు తయారైంది. రాజ్యాంగం మైనారిటీలకు ఇచ్చిన హక్కులను తొలగించే కుట్ర జరుగుతోంది. ఈ బిల్లును ముస్లింలతో సంప్రదించకుండా రూపొందించడం కేంద్ర ప్రభుత్వ కుట్ర ఆలోచనను బయటపెట్టింది.
– షేక్ ఇబ్రహీం, జమాఅతె ఇస్లామీ హింద్, ఏలూరు నగర అధ్యక్షుడు

చదవడం ద్వారా విజ్ఞానం సంపాదించాలి



మాట్లాడుతున్న సెట్‌వెల్ సీఈఓ మధు భూషణరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు చదవడం ద్వారా విజ్ఞానాన్ని సంపాదించాలని, వ్యక్తిగత స్కిల్స్ పెంచుకోవాలని కెరీర్ కౌన్సిలర్ జి.ప్రవీణ్ కృష్ణ సూచించారు. యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నేషనల్ కెరీర్ సర్వీస్ జిల్లా కోర్డినేటర్ వి.వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ లక్ష్యం కలిగి, జ్ఞానంతో, సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. సెట్‌వెల్ సీఈఓ సి.మధుభూషణ రావు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.